క్లుప్తంగా

నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (దర్గామిట్ట) : జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు సంబంధించి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ చాంబర్‌లో జర్నలిస్టుల హౌసింగ్ కమిటీ మూడో సమావేశం కలెక్టర్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపునకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న దృష్ట్యా ఆర్డీఓలు ప్రత్యేక శ్రద్ధ వహించి భూముల ఎంపిక చేయాలన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, మస్తాన్‌రెడ్డి, మురళి, ఆర్డీఓలు మాలోల, శీనానాయక్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి సదారావు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లూరు రూరల్ : రూరల్ పరిధిలోని కల్లూరుపల్లి ఇందిరమ్మ కాలనీలో ధార్మిక పరిషత్ ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా రాజరాజేశ్వరి అమ్మవారి విగ్రహాన్ని కొలువుదీర్చి బుధవారం విశేష పూజలు నిర్వహించారు. తొలుత విశేష కుంకుమార్చన, లలితా సహస్రనామ పూజలు, కుంభ హారతులు భక్తిశ్రద్ధలతో జరిపారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కోలాట ప్రదర్శన చేశారు. భక్తిగీతాలను ఆలపించారు. ఆలయ ప్రధానార్చకుడు రఘురామ్‌శర్మ, వేద పారాయణదారుడు రామకృష్ణశర్మ, ధర్మకర్తగా భారతి వ్యవహరించారు.

'రంగడి' సన్నిధిలో వేలంపాట



నెల్లూరు(బృందావనం) : రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో 2024–25 సంవత్సరంలో తాత్కాలిక లీజు హక్కులకు బహిరంగ వేలంపాటలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ ఏడాది కొబ్బరి కాయలు, పూజా ద్రవ్యాలు, ఫొటోలు, పుస్తకాల విక్రయం, పాదరక్షల స్టాండ్, దేవస్థానం కల్యాణ మండపంలో వివాహాది కార్యాలకు లైటింగ్ డెకరేషన్, హైరర్స్ సప్లై, స్టేజీ పూల డెకరేషన్, భక్తులు సమర్పించే వస్త్రాలను సేకరించుకునే హక్కులకు వేలంపాటలు జరిపామన్నారు. ఇందులో దేవస్థానానికి రూ.10,62,000 ఆదాయం వచ్చిందన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది రూ.1,93,000 ఆదాయం పెరిగిందన్నారు. కాగా కొబ్బరి చిప్పలు సేకరించుకునే హక్కును వాయిదా వేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, సభ్యులు అడపా లక్ష్మి, వీరేపల్లి పద్మజ పాల్గొన్నారు. పరిశీలకులుగా దేవస్థానం ఇన్‌స్పెక్టర్ ఎం.సుధీర్ వ్యవహరించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

నెల్లూరు (టౌన్) : బాల్య వివాహాలను పూర్తి స్థాయిలో అరికట్టాలని పలువురు అధికారులు, నాయకులు అన్నారు. నగరంలోని వెంగళరావు నగర్‌లో ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో ప్రజాసత్తా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పులగర శోభన్‌బాబు అధ్యక్షతన బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న అధికారులు, నాయకులు మాట్లాడుతూ బాలికలు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల్లో స్థిరపడి అభివృద్ధి చెందాలని తెలిపారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, తద్వారా మానసికంగా, శారీరకంగా, ఆరోగ్య పరంగా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే పోలీసులు లేదా అధికారులకు తెలియజేయాలని సూచించారు. బాలికల చదువు ఆవశ్యకత, బాల్య వివాహాలు జరిగితే నష్టాల పట్ల అవగాహనకు పలు పాటలు పాడి, ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డాక్టర్ పి.రీనాకుమారి, జి.మాధవరావు, జిల్లా బాలల సంరక్షణాధికారి సుజాత, 32వ డివిజన్ కార్పొరేటర్ తాళ్లూరు అవినాష్, డివిజన్ ఇన్‌చార్జిలు బెజవాడ మేఘనాథ్ సింగ్, అలగర ప్రభాకర్, క్రిస్టియన్ సెల్ కార్యదర్శి డి.రాజేష్, ప్రజాసత్తా రాష్ట్ర కార్యదర్శి దువ్వూరు ప్రసాద్ మాట్లాడారు. 35, 41 డివిజన్ కార్పొరేటర్లు వై.శరత్‌చంద్ర, బాబ్జియాదవ్, ప్రజాసత్తా ఎస్సీ సెల్ కార్యదర్శి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబు మాటలు నమ్మొద్దు'

- అండగా ఉన్న జగనన్నను మళ్లీ ఆశీర్వదించండి
- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి


సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీకి పొదుపు మహిళల పాలాభిషేకం

కొడవలూరు: 'వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో పేదలకు ఎంతో మేలు చేశారు. అదే చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా ఉన్నప్పుడు ప్రజల సొమ్మును దోచుకున్నాడు. ఆ డబ్బుతోనే వచ్చే ఎన్నికల్లో ప్రలోభపెట్టేందుకు వస్తున్నాడు. బాబు మాటలు ఎవరూ నమ్మొద్దు' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని నార్తురాజుపాళెంలో బుధవారం జరిగిన ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలకు ముఖ్యమంత్రి అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తదితర నాయకులు ఎన్నికలకు రెండు నెలల ముందే కనిపిస్తున్నారని, గడిచిన నాలుగున్నరేళ్లలో ఎక్కడ ఉన్నారో ప్రజలే ఆలోచించాలన్నారు. బాబు ఏదో ఒక పార్టీతో పొత్తులేనిదే ఎన్నికల్లో పోటీ చేయరన్నారు. పేదలకు మేలు జరుగుతుంటే చూడలేని వాళ్లంతా ఏ విధంగానైనా జగనన్నను ఓడించాలని చూస్తున్నారన్నారు. వైఎస్సార్ పేరును చార్జిషీట్‌లో పెట్టి, జగన్‌ను అక్రమ కేసులతో 16 నెలలు జైల్లో ఉంచిన కాంగ్రెస్ పార్టీతో చేతులు కలపడం తగునా అని షర్మిలను ప్రశ్నించారు. తొలుత సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. పొదుపు మహిళలు నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఎంపీపీ జి.జ్యోతి, ఏపీఎం ఎస్.రుక్మిణి, సంఘమిత్ర అధ్యక్షురాలు పుష్ప, నవీన్‌రెడ్డి, ఎస్.సుబ్బారెడ్డి, సతీష్‌రెడ్డి, నాయకులు కె.శ్రీనివాసులురెడ్డి, ఎ.మోహనకృష్ణ, పి.అచ్యుతరెడ్డి పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఎస్.రుక్మిణి ఆధ్వర్యంలో జరిగిన ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. చంద్రశేఖరపురం ఏకలవ్య గిరిజన ఆదర్శ గురుకుల పాఠశాల, కళాశాల, కొడవలూరులోని గిరిజన బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు నృత్య ప్రదర్శనలిచ్చారు. ఆటవిక, గిరిజన కోలాట నృత్యాలతో ఆహుతులను ఆకట్టుకున్నారు. దీంతో కార్యక్రమం ఉత్సాహ భరితంగా సాగింది. స్థానిక ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు నృత్య ప్రదర్శనలిచ్చిన చిన్నారులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఏపీఎం రుక్మిణీని ప్రత్యేకంగా సన్మానించారు. కాగా ఆసరా కార్యక్రమానికి సుమారు ఐదు వేల మంది మహిళలు తరలివచ్చి విజయవంతం చేశారు.


గురుకుల విద్యార్థుల నృత్య ప్రదర్శన


గురుకుల విద్యార్థినుల కోలాటం

జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ


భవానమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అరుణమ్మ

విడవలూరు : ఇటీవల అనారోగ్యంతో విడవలూరు ఎంపీపీ వేణుంబాక భవానమ్మ మృతిచెందగా, ఆమె కుటుంబాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ బుధవారం పరామర్శించారు. విడవలూరు మండల కేంద్రంలోని మన్మధరావుపేటలో ఉన్న ఆమె నివాసానికి వెళ్లి ప్రగాఢ సానుభూతి తెలిపారు. భవానమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈమె వెంట ఎంపీడీఓ జి.శ్రీనివాసరావు ఉన్నారు.

రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం


మాట్లాడుతున్న తహసీల్దార్ శివకృష్ణయ్య

మనుబోలు : రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారం అవుతున్నాయని తహసీల్దార్ శివకృష్ణయ్య అన్నారు. మండలంలోని జట్లకొండూరు గ్రామంలో రీసర్వేపై బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సర్వే పూర్తయ్యాక రైతుల పేరు మీద పట్టాలు అందజేస్తామని తెలిపారు. ఎంతో కాలంగా ఉన్న సమస్యలు రీసర్వేతో పరిష్కారమవుతాయన్నారు. ఉపసర్పంచ్ ఆవుల తులసీరామ్ మాట్లాడుతూ తమ పంచాయతీ పరిధిలోని కుడితిపల్లి గ్రామం సోత్రికం(ఇనాం) భూములు కావడంతో రైతులు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతుండే వారని తెలిపారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో దీనిని అసైన్‌మెంట్ భూములుగా మార్పు చేశారని వివరించారు. కార్యక్రమంలో సర్వేయర్‌లు శ్రీనివాస్, రాజా, వీఆర్వో అఖిల్, వైఎస్సార్‌సీపీ జిల్లాల సేవాదళ్ కార్యదర్శి గుంజి రమేష్, సచివాలయ కన్వీనర్ జగదీష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామాల్లో మంత్రి కాకాణి పర్యటన

వెంకటాచలం: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం సర్వేపల్లి గ్రామంలో పర్యటిస్తారని వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సర్వేపల్లి రిజర్వాయర్ వద్దకు చేరుకుని చేప పిల్లలను వదిలే కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం సర్వేపల్లి గ్రామంలో నాలుగో విడత ఆసరా కార్యక్రమంలో పాల్గొంటారని తెలియజేశారు.

సాయంత్రం పీజీపట్నానికి..

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం సాయంత్రం 5 గంటలకు మండలంలోని ప్రభగిరిపట్నం గ్రామానికి వస్తారని సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి బుధవారం తెలిపారు. గ్రామ సచివాలయ భవనం, సైడ్ డ్రెయిన్లు, రోడ్లను మంత్రి కాకాణి ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్ అదుపుతప్పి పడడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కాకుటూరు వద్ద బుధవారం జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన రాజేష్ పని నిమిత్తం బైక్‌పై గూడూరుకు వెళ్తుండగా, కాకుటూరు సమీపంలో ఆటో అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో రాజేష్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు


రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కొడవలూరు: కొడవలూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక పీహెచ్‌సీ వైద్య బృందం ఆధ్వర్యంలో బుధవారం రక్త పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలోని 450 మంది విద్యార్థులకు రక్తపరీక్షలు చేసి గ్రూపు నిర్ధారించడంతో పాటు హిమోగ్లోబిన్ శాతాన్ని పరీక్షించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎం.రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ రక్త గ్రూపు తెలుసుకోవడం ఆవశ్యమన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్త గ్రూపు తెలియడం వల్ల వైద్యం వెంటనే అందించే వెసులుబాటు ఉంటుందని చెప్పారు. హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్న విద్యార్థులను గుర్తించి ఐరన్ మాత్రలివ్వడంతో పాటు పోషకాహార జాగ్రత్తల గురించి తెలియజేయడం వల్ల రక్తహీనతను అధిగమిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఏ షఫీఉద్దీన్, ఏఎన్‌ఎం శేషుబాయి, ఎంఎల్‌హెచ్‌పీ రషీదా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పలువురికి సన్మానం


కొడవలూరు: హెచ్‌ఎం ప్రభావతిని సన్మానిస్తున్న ఎంఈఓలు

కొడవలూరు: మండలంలోని గుండాలమ్మపాళెం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసే డి.ప్రభావతి బుధవారం పదవీ విరమణ చేశారు. దీంతో స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ–1 జి.వసంత కుమారి మాట్లాడుతూ హెచ్‌ఎంగా ప్రభావతి ఎంతో నిబద్ధతతో పనిచేశారని, ఆమెను సన్మానించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 ఎస్.అంకయ్య, సీఆర్‌ఎంటీలు ఎం.దయాకర్, జె.పెంచలరావు, కార్యాలయ సిబ్బంది విజయమ్మ, పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- విడవలూరు: స్థానిక పీఆర్‌ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్యశాస్త్ర అధ్యాపకునిగా పనిచేస్తున్న కె.శ్రీనివాసులు బుధవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఆయన్ను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనకు సహకరించిన తోటి అధ్యాపకులు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ చిరంజీవి, కళాశాల ప్రిన్సిపల్ బి.సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.


విడవలూరు : శ్రీనివాసులును సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది

వైభవంగా గంధ మహోత్సవం


గంధ మహోత్సవంలో గ్రామస్తులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని రేబాల గ్రామంలో హజరత్ ఖాదర్‌వలీ దర్గా వద్ద గంధ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ముస్లిం మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 సంవత్సరాల నుంచి గంధ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుల మతాలకు అతీతంగా గంధ మహోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సయ్యద్ బాషా, మల్లికార్జున, మాహబాషా, ఖలీల్, ఖాదర్‌బాషా, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీహరి

కోవూరు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను మరింత వేగవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీహరి అన్నారు. కోవూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై బుధవారం ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు తప్పక పాటించాలన్నారు. అదే విధంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం చేసుకుంటున్న లబ్ధిదారులకు రావాల్సిన నిధులను సకాలంలో అందేలా తగిన చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం జరుగుతున్న పనులపై గ్రామాలవారీగా సమీక్షించారు. ఏపీఓ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి రూ.50 వేల వితరణ


నగదు అందజేస్తున్న కోవూరు ఏఎంసీ చైర్మన్

కోవూరు : చేజర్ల మండలంలోని పాడేరు గ్రామంలో మాతా పరమేశ్వరి దేవాలయ నిర్మాణానికి సంబంధించి కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి ఆలయ నిర్వాహకులకు రూ.50 వేలను వితరణగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రాధాకృష్ణారెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో చేజర్ల వీఆర్వో ప్రసాద్, ఆంజనేయులు, శ్రీనివాసులురెడ్డి, మల్లికార్జున, వంశీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రసన్న చేయూత


ఆర్థిక సాయం అందుకున్న వారితో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట : కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ ద్వారా ఇందుకూరుపేటలో అనారోగ్యంతో బాధపడుతున్న ఐదుగురికి, కొత్తూరులో ఆలయ నిర్మాణానికి బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. ఇందుకూరుపేట దళితవాడకు చెందిన చలం అన్నపూర్ణ, పేదాటి ప్రమీలమ్మ, పడమటవీధికి చెందిన సుజాత, కాలువగట్టు పల్లిపాళేనికి చెందిన పనపాక మాధవయ్య, అదే గ్రామానికి చెందిన నాగేళ్ల పెంచలయ్యలకు నెల్లూరులోని ఎమ్మెల్యే నివాసంలో రూ.20 వేల చొప్పున మొత్తం రూ.లక్ష అందించి ఆదుకున్నారు. అలాగే కొత్తూరులో పోలేరమ్మ ఆలయ మరమ్మతులకు రూ.50 వేలను అందజేశారు. కార్యక్రమంలో కోవూరు యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ గునుపాటి సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రై సైకిల్ అందజేత

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని రేబాల గ్రామానికి చెందిన దివ్యాంగుడు మాగంటి సునీల్‌కు కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి బుధవారం బ్యాటరీ ట్రై సైకిల్ అందజేశారు. నెల్లూరులోని ఎమ్మెల్యే నివాసంలో దీనిని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఆర్ ట్రస్ట్ తరఫున రూ.35 వేల విలువ చేసే సైకిల్‌ను అందజేశామన్నారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న


నేడు : స్టేడియం లోపలి భాగం


నాడు : ధ్వంసమై ఇలా..

ఏళ్ల నాటి కల సాకారం

పొదలకూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమంతోపాటు అదేస్థాయిలో అభివృద్ధి పనులు కూడా చేస్తోంది. పొదలకూరులో రెండు దశాబ్దాల పాటు చిట్టడవిని తలపించిన స్టేడియానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మరమ్మతులు జరిగాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో స్టేడియం రూపురేఖలు మారిపోయాయి. సుమారు రూ.కోటి వెచ్చించి భవనం మరమ్మతులతోపాటు, 11.59 ఎకరాల విలువైన క్రీడా ప్రాంగణాన్ని చదును చేశారు. ఈనెల 12వ తేదీన ప్రారంభించారు. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు ఉన్నప్పుడు కలగా మిగిలిన స్టేడియం వైఎస్సార్‌సీపీ పాలనలో పూర్తయింది. దీంతో ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. సర్వేపల్లి నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఇక్కడే నిర్వహిస్తున్నారు.


నేడు : కొత్త కళ సంతరించుకున్న స్టేడియం


నాడు : భవనం ఇలా..